క్లుప్తంగా

నేడు కొంకుదురు సావారంలో గడప గడపకూ

బిక్కవోలు: మండల పరిధిలోని కొంకుదురు సావారం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కలవచర్లలో..

రాజానగరం: స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో మండలంలోని కలవచర్లలో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు, జేసీఎస్ ఇన్‌చార్జులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని ఆ పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద కోరారు.

గూడెపు శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు గూడెపు శ్రీనివాస్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. సీతానగరంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పువ్వాడ కృష్ణ, ఉపాధ్యక్షుడు కంకటాల రమేష్, ట్రెజరర్ జయవరపు గంగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గూడెపు శ్రీనివాస్‌కు వాసవీ కన్యకా పరమేశ్వరి ప్రతిమ అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీల్లో ఎరువులు సిద్ధం

గోకవరం: సొసైటీల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సొసైటీకి వచ్చి తీసుకోవాలని గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు తెలిపారు. గోకవరం, తంటికొండ, రంపయర్రంపాలెం సొసైటీల్లో యూరియా, డీఏపీ, పోటాష్, జింకు, 20-20-0-13 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం శివారులోని ఇటుకబట్టీ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై కట్టా శారదా సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.11,250 స్వాధీనం చేసుకున్నారు.

స్పందనకు మూడు వినతులు



ఇన్‌చార్జి తహసీల్దార్ దొరకయ్యకు వినతి పత్రం అందిస్తున్న బీసీ నాయకులు

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మూడు వినతులు వచ్చినట్లుగా ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య తెలియజేశారు. సుభద్రంపేట గ్రామంలోని పెద్ద చెరువు గట్టున ఉన్న వేప, తుమ్మ, రావి తదితర 10 చెట్లను కె.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఆదివారం అక్రమంగా నరికి కలపను తరలించుకుపోయారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. కోటపాడులోని సర్వే నంబరు 190/2ఏ/2లో ఓ వ్యక్తి పుట్టగొడుగుల వ్యర్థాలు నిల్వ చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఎంపీటీసీ సుంకర అప్పారావు వినతి అందించారన్నారు. రంగంపేట సర్వే నంబరు 4/96లో ఖాళీగా ఉన్న బీసీ వసతి గృహాన్ని బీసీలకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానిక బీసీ సంఘ నాయకులు కోరారన్నారు.

హోమియో వైద్యంపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గౌతమీ ఘాట్‌లోని జగద్గురు పీఠం (వరల్డ్ టీచర్ ట్రస్ట్) ఆధ్వర్యంలో హోమియో వైద్యంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆగస్టు 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. అనంతరం ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ నిర్వహిస్తారు. సుమారు 40 సెలవు దినాలు (ఆదివారాలు, రెండో శనివారాలు కలిపి) అనగా జూన్ 2024 వరకూ కొనసాగుతాయి. అత్యవసర పరిస్థితిని బట్టి ఆన్‌లైన్‌లోనూ నిర్వహిస్తారు. శిక్షణ పొందేవారు ఇంటర్నెట్‌తో కూడిన స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలి. హోమియో వైద్యంతో మానవసేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. హోమియో శిక్షణ పూర్తిగా ఉచితం. అయితే పుస్తకాలు, నోట్సులు తదితర వాటి కోసం రూ.1000 చెల్లించాలి. 25 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు, డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి కలవారు ముందుగా ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 94408 39773, 98663 26043 నంబర్లను సంప్రదించాలి.

పౌర సేవ.. ఇంత సులువా..

- జగనన్న సురక్షతో అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు
- నియోజకవర్గంలో 83,244 మందికి సేవలు

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చింది. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తుంది. ఆ కోవలోనే తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి సైతం అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో ప్రభుత్వ నిర్ణయంపై జేజేలు పలికారు. ఒక్క మాటలో చెప్పాలంటే పౌర సేవలు ఇంత సులువా అన్న రీతిలో వైఎస్సార్ సీపీ పాలన సాగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పందలపాకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందుకున్న లబ్ధిదారులు

ప్రభుత్వ నిర్ణయంపై ప్రశంసలు

జులై 1 నుంచి 27 వరకూ నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్సీ, రేషన్ కార్డు, విభజన వంటి 11 రకాల ధ్రువపత్రాలను అందజేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలను సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని సత్వరం పరిష్కరించడం చాలా బాగుందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

సర్వీసు చార్జీలు లేకుండా

ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు), మరణ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రం, కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్లు యాడ్ చేయడం వంటి సేవలు పౌరులకు అందించారు. ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే 83,244 మందికి సేవలందించారంటే సురక్ష విజయానికి అంతకంటే నిదర్శనమేముంటుంది.

సమష్టి కృషితోనే ఎక్కువ ధ్రువపత్రాలు



సమష్టి కృషి కారణంగానే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎక్కువమందికి ధ్రువపత్రాలు అందజేయగలిగాం. మా సిబ్బంది కార్యాలయ పని సమయంలోనే కాకుండా అదనంగా పనిచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల కృషి వల్ల ఎక్కువ మదికి సేవలందించగలిగాం.

– పోసిబాబు, తహసీల్దార్, బిక్కవోలు మండలం

ధ్రువపత్రం వెంటనే అందించారు



ఈ ఏడాది మే నెలలో మా అమ్మ మరణించింది. జగనన్న సురక్షలో ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేస్తే ఎలాంటి రుసుం తీసుకోకుండానే వెంటనే అందించారు. జగనన్న సురక్ష వల్ల ప్రభుత్వ సేవలు ఇంత సులువా అనిపిస్తుంది.

– జక్కా నాగేశ్వరరావు, పందలపాక

సురక్షతో ఎంతో మేలు



జగనన్న సురక్షలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశాం. అంత త్వరగా కార్డు వస్తుందని అనుకోలేదు. పైసా ఖర్చు లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న జగనన్న సురక్ష వల్ల నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుంది.

– బి.నవీన, పందలపాక

అనపర్తి నియోజకవర్గం జగనన్న సురక్ష సేవల వివరాలు

మండలం	అనపర్తి	బిక్కవోలు	రంగంపేట	పెదపూడి
కులం	9,504	16,365	8,998	5,485
ఆధాయధృవ	8,141	15,388	8,172	5,044
ఆధార్ సీడింగ్	606	420	297	605
ఇతర సేవలు	2,896	584	80	659
మొత్తం	21,147	32,757	17,547	11,793

ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాలు



బాలింతకు రూ.5 వేల ఆర్థిక సాయం అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: వైద్యులు గర్భిణులకు అత్యుత్తమ వైద్యమందించి సుఖ ప్రసవాలు చేస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం మరింత పెరుగుతుందని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరంలో నూతనంగా ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీరారామచంద్రపురానికి చెందిన సీహెచ్ చిన్నారికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిల సహకారంతో రామవరంలో పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించుకున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుమతి, మీనాక్షి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పంచాయితీ కార్యదర్శి పీవీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం వద్ద గోదావరిలో ఇనపాల జార్జిరాజు కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్సై కె.చిరంజీవి, కానిస్టేబుళ్లు పాపినాయుడు, వీఆర్వో గోసాల చిన్నా తదితరులు సోమవారం ఉదయం 6 గంటలకూ పురుషోత్తపట్నం చేరుకున్నారు. ఐదుగురు గజ ఈతగాళ్లతో బోటుపై గోదావరిలో గాలింపు చర్యలు కొనసాగించారు. పురుషోత్తపట్నానికి చెందిన 41 ఏళ్ల ఇనపాల జార్జిరాజు ఆదివారం మధ్యాహ్నం గోదావరిలో కొట్టుకువచ్చే కట్టెల కోసం వెళ్లాడు. అతడు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన తండ్రి సత్యేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎస్సై చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, గోదావరి ఒడ్డున జార్జిరాజు చెప్పులు కనిపించాయి. వెంటనే గోదావరిలో బోటుపై గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ తెలియలేదు. దీంతో రెండోరోజు సోమవారం తిరిగి ప్రారంభించారు. రాత్రి 7 గంటలైనా జార్జిరాజు ఆచూకీ తెలియరాలేదు.

మణిపూర్‌లో ఘటనలు దారుణం

సీతానగరం: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు దారుణమని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ నాయకుడు పలివెల వీరబాబు అన్నారు. సీతానగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనలపై ప్రధాని మోదీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ ద్వారా మరిన్ని సేవలు

- జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి
- భవిష్యత్తు కార్యక్రమాలపై సమీక్ష



బాధితులకు కిట్లు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తాడితోటలోని సంహిత కన్వెన్షన్ హాల్లో జిల్లాస్థాయి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన కోరుకొండ, సీతానగరం మండలానికి సంబంధించిన 30 కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున రిలీఫ్ మెటీరియల్ అందజేశామన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో జెండా వందనం, ఆగస్టు 26న మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీలో మెగా రక్తదాన శిబిరం, రాజమహేంద్రవరం అర్బన్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం నియోజకవర్గాలలో రెడ్ క్రాస్ సొసైటీ కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్లు డాక్టర్ లంక సత్యనారాయణ, డాక్టర్ దాల్ సింగ్ భాస్కర రావు, డాక్టర్ మహాలక్ష్మి, కర్రి లక్ష్మీనరసింహరెడ్డి, సీతానగరం రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రమేష్ బాబు పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య గోదావరి ప్రవాహం



బొబ్బిల్లంక రేవులో బందోబస్తు నిర్వహిస్తున్న వీఆర్వో గంగరాజు, కానిస్టేబుళ్లు అవినాష్, దొర

సీతానగరం: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో సోమవారం ములకల్లంక వాసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య బోట్లపై రాకపోకలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ములకల్లంకలో వైద్యశిబిరం కొనసాగుతోంది. ప్రజలు బోట్లపై లైఫ్ జాకెట్లు ధరించి రాకపోకలు జరుపుతున్నారు. వీఆర్వో గంగరాజు, నాగమణి, కానిస్టేబుళ్లు అవినాష్, దొర, వీఆర్ఏ రాజేంద్రప్రసాద్ తదితరులు రేవు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టారు. వరద కారణంగా ముంపుబారిన పడిన పొలాలు, కూరగాయల పాదులు, తోటలు ఎందుకూ పనికి రావని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వరద తగ్గుముఖం పట్టినా గోదావరి ప్రవాహం తీవ్రంగానే ఉంది.

అంకితభావంతో పనిచేస్తే చిరకాల గుర్తింపు

రంగంపేట: చిత్తశుద్ధి, అంకితభావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ముఖ్య కార్యనిర్వాహణాధికారి నూలు పల్లపురాజు ఉద్యోగ విరమణ, మరియు షష్టి పూర్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పల్లపురాజు దంపతులను నాయకులు, సంఘ సభ్యులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, సంఘం అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, డీసీసీబీ సూపర్‌వైజర్ ఐ.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



పల్లపురాజు దంపతులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు తదితరులు

నన్నయ అధ్యాపకుడికి డాక్టరేట్



నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు నుంచి డాక్టరేట్ ప్రతిని అందుకుంటున్న డాక్టర్ వెంకయ్యప్పలస్వామి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ బూర్లె వెంకయ్యప్పలస్వామికి ఆంధ్రా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు నుంచి వెంకయ్యప్పలస్వామి సోమవారం అందుకున్నారు.

ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ బాత సహకారంతో 'డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి డయాబెటిక్ రెటినోపతిపై విస్తృతమైన పరిశోధన' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ డాక్టరేట్ మంజూరు చేశారు. ఇదే పరిశోధనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ గ్లోబల్ రీసెర్చ్ అవార్డ్స్ అనే స్వచ్ఛంద సంస్థ బెస్ట్ రీసెర్చ్ అవార్డు అందజేసింది.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు సూచించారు. సోమవారం స్థానిక పడాల పెదపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జులై 28, 29 తేదీల్లో కర్నూలు జిల్లా గార్గేయపురంలో జరిగిన అంతర్ జిల్లా అండర్ 17, 14 విభాగాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ఒక గోల్డ్, రెండు సిల్వర్ పతకాలు గెలుచుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అండర్ 17 విభాగంలో ఎం.భరత్ గోల్డ్, ఎం. సతీష్‌కుమార్ సిల్వర్, పి.హర్ష బ్రాంజ్ పతకాలను సొంతం చేసుకోగా అండర్ 14 విభాగంలో ఎ.యశ్వంత్ సిల్వర్ మెడల్‌ను సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు డి.యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, జయ కృష్ణారెడ్డి, వీర్రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాల పనులు వేగవంతం

- పెండింగ్ పనులపై దృష్టి సారించాలి
- అమరావతిలో ఉన్నతాధికారులు, మంత్రిని కోరిన ఎమ్మెల్యే రాజా



ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ గాయత్రీ దేవితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: వాటర్ గ్రిడ్, జలజీవన్ మిషన్ పథకాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. అమరావతిలో వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులను కలుసుకుని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగిరమే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

▸▸ ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవిని కలిసి, రూ.215 కోట్లతో చేపట్టే వాటర్ గ్రిడ్ పథకంపై చర్చించారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు (ఓహెచ్ఆర్) గోదావరి నీటిని అందించే ఈ పథకం పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 65 కోట్లతో నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ గోదావరి జలాలను అందించేలా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం పనులు కూడా త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు.

▸▸ సీతానగరం మండలం రఘుదేవపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) పనులకు సాధ్యమైనంత త్వరగా టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లును కోరారు.

▸▸ ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్‌ను కలుసుకుని మంజూరైన నిధులతో నియోజకవర్గంలో చేపట్టిన ఇరిగేషన్ అత్యవసర పనులపై చర్చించారు. ఇవి పూర్తిస్థాయిలో జరిగే విధంగా ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను కూడా మంజూరు చేసి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

▸▸ రూసా పథకంలో మంజూరైన నిధులతో సీతానగరంలో డిగ్రీ కళాశాల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ, కంప్యూటర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా అవసరమైన బోధకులను నియమించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

వర్షాలకు నీరు చేరితే రాజకీయమా!


మధురపూడి: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జగనన్న లేఅవుట్లలో నీరు చేరితే.. దాన్ని ప్రతిపక్షాలు రాజకీయ మనుగడ కోసం ఉపయోగించుకోవడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, యడ్ల గంగా సురేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ పేదలందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్నదే అన్నారు. సీఎం జగన్ పాలనలో పేదల అభ్యున్నతిని చూడలేకే లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో జరిగిన అన్యాయాలపై ఎప్పుడూ పెదవి విప్పని పవన్ కల్యాణ్ బృందం.. ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఆక్రమణ తొలగింపు

సీతానగరం: రఘుదేవపురంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి జీఎస్ఎస్ సాయి తన సిబ్బందితో తొలగించారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు పోలీస్ బందోబస్తుతో రఘుదేవపురం శ్మశానవాటిక రోడ్డులోని గ్రామకంఠం స్థలంలో ఆక్రమించి కట్టిన చిరుదుకాణాన్ని ఖాళీ చేయించారు. ఇదే రోడ్డులో ఉన్న బ్రాందీషాపులో మద్యం కొనుగోలు చేసిన కొందరు ఈ చిరు దుకాణంలో మద్యం తాగి, శ్మశాన వాటికకు వెళ్లే వారిపై ఘర్షణకు దిగుతున్నారని వడ్డిరపేటకు చెందిన పలువురు పంచాయతీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ చర్యలు తీసుకున్నారు.

ఉన్నత లక్షణాలతో సుస్థిర అభివృద్ధి

రాజానగరం: ఇంజినీర్లు ఉన్నత లక్షణాలను అలవర్చుకుంటే సమాజంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని జేఎన్‌టీయూకే పెట్రోలియం కోర్సు విద్యాసలహాదారు కేవీ రావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 'ఇంజినీర్ల లక్షణాలు' అనే అంశంపై సోమవారం చర్చాగోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌గా పాల్గొన్న కేవీ రావు మాట్లాడుతూ ఉన్న ప్రపంచాన్ని శాస్త్రవేత్తలు కొనుగొంటారని, లేని ప్రపంచాన్ని ఇంజినీర్లు సృష్టిస్తారన్నారు. నూతన విషయాలను తెలుసుకోవాలనే ఆకాంక్ష ఇంజినీర్లకు ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా అభివృద్ధి చెందాలన్నారు. క్రియేటివిటీ, ఇన్నోవేషన్స్‌పై దృష్టిని సారించాలని సూచించారు. వివిధ దేశాలలో ఇంజినీరింగ్ రంగంలో ఉన్న అవకాశాలను, నూతన ఆవిష్కరణలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రావు

మెట్టలో జోరందుకున్న వరినాట్లు

మధురపూడి: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. మండలంలో సాధారణ విస్తీర్ణం 6,046 హెక్టార్లు ఉండగా, 60 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. శ్రీరంగపట్నం, బూరుగుపూడి, గాదరాడ, నర్సాపురం, జంబూపట్నం, దోసకాయలపల్లి, కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, కణుపూరు, రాజవరం తదితర గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎంటీయూ 1,318, 1,061, 1,064, బీపీటీ 5,204, పీఎల్ఏ 1,100 రకాలను సాగు చేస్తున్నారు.



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు